

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.162	235	267
సూర్యాపేట	రూ.165	240	270
నల్లగొండ	రూ.158	236	278

ఉష్ణోగ్రత గరిష్ఠం 39.0 । కనిష్ఠం 25.0

ధాన్యం కొనుగోళ్లు చివరి దశకు



వలిగొండ మండలం గోకారం కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం రాశులు

- ఇప్పటికే రైతుల ఖాతాల్లో రూ.1,275కోట్ల మేర జమ
- అకాల వర్షాలతో పలు చోట్ల తడిసిన ధాన్యం
- సకాలంలో ఎగుమతికాక సమస్యలు
- ఇంకా పలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు

నల్లగొండ/సూర్యాపేట, మే 16: (ఆంధ్రజ్యోతి), ఉమ్మడి నల్లగొండ జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు చివరి దశకు చేరుకున్నాయి. ఓవైపు ప్రభుత్వరంగ సంస్థలు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయగా, మరో పక్క మిల్లర్లు కూడా ధాన్యం కొనుగోలు చేశారు. ధాన్యం కొనుగోలు ప్రారంభించాక పీఏసీఎస్, ఐకేపీ కేంద్రాల్లో హమాలీలు, కూలీల కొరత కారణంగా ధాన్యం కొనుగోళ్లు, ఎగుమతులు ఆలస్యమయ్యాయి. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. అయితే ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చింది. మరో మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొన్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని పలు కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిస్తే బాధ్యత ఎవరిదని రైతులు ప్రశ్నిస్తున్నారు.

● యాదాద్రి జిలాఌ మోత్కూరు మండలంలో రెండు కేంద్రాల్లో ఇంకా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 5వేల బస్తాల ధాన్యం ఎగుమతికి సిద్ధంగా ఉంది. రహీంఖాన్‌పేటలో రోజుల తరబడి ఎగుమతి కావడం లేదు. మిల్లర్లు సకాలంలో ధాన్యం దిగుమతి చేసుకోకపోవడంతో లారీలు రాక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కాగా, మిల్లుల్లో స్థలం లేకపోవడంతో మిల్లర్లు ధాన్యం దిగుమతి చేసుకోవడం లేదని సమాచారం. తుంగతుర్తి మండలంలో 14 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు ఉన్నాయి. గుండాల మండలంలో 16 కేంద్రాల్లో 27వేల బస్తాల ధాన్యం ఎగుమతికి సిద్ధంగా ఉంది. ఇక్కడ బస్తాకు రూ.3 నుంచి రూ.5 ఇస్తేనే లారీల్లో లోడ్ ఎత్తుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఆత్మకూర్(ఎం) మండలంలో 21 కేంద్రాల్లో ధాన్యం నిల్వలు ఉన్నాయి. ధాన్యం సకాలంలో ఎగుమతి కాకపోవడంతో నిల్వలు పేరుకుపోతున్నాయి. వలిగొండ మండలంలో యాసంగిలో 45,600 ఎకరాల్లో వరి సాగుకాగా, 93,380 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అవుతుందని అంచనా వేశారు. ఇప్పటి వరకు 10,07,209 బస్తాల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. జాప్యం కారణంగా ధాన్యం కొనుగోలుకు ఇంకా సుమారు 20 రోజుల సమయం పట్టే అవకాశం ఉంది.

అకాల వర్షంతో తడిసిన ధాన్యం

పలు చోట్ల అకాల వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. యాదాద్రి జిల్లాలోని ఆత్మకూర్(ఎం) మండలంలో ధాన్యం తడిసి రైతులు నష్టపోయారు. సంస్థాన్‌నారాయణపురంలో కొనుగోళ్లు ఇప్పటికే పూర్తయ్యాయి. ఈ మండలంలో మొత్తం ఏడు కేంద్రాలను తెరవగా, నాలుగింటిని మూసివేశారు. మూడు కేంద్రాలు మరో రెండు రోజుల్లో మూతపడనున్నాయి. మిల్లుల్లో స్థలం లేక కొనుగోలు చేసిన ధాన్యాన్ని రంగారెడ్డి జిల్లాకు తరలిస్తున్నారు. ధాన్యానికి సైతం సకాలంలో డబ్బు చెల్లించడం లేదని రైతులు వాపోతున్నారు. చౌటుప్పల్ మండలంలోని కొన్ని కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగుల కొరత ఉండటంతో, ఎగుమతికి ఆలస్యమవుతోంది. తూకాలు కూడా ఆలస్యమవుతున్నాయి. కొన్ని మిల్లుల్లో ధాన్యం దిగుమతికి వారం రోజుల సమయం పడుతోంది. మోటకొండూరు మండలంలో సైతం హమాలీల కొరత కారణంగా కొనుగోళ్ల జాప్యం కాగా, మిల్లుల్లో సైతం దిగుమతి కావడం లేదు. ఇటీవల భువనగిరిలో రైతులు తడిసిన ధాన్యంతో కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు.

●దేవరకొండ డివిజన్‌లో 78వేల క్వింటాళ్ల కొనుగోలు లక్ష్యంకాగా, 15,200క్వింటాళ్లను కొనుగోలు చేశారు. డివిజన్‌లో పంట దిగుబడి తక్కువగా ఉండటంతో ఆరు కొనుగోలు కేంద్రాలకు రెండు మాత్రమే ఏర్పాటు చేశారు. నల్లగొండ సమీపంలోని నార్కట్‌పల్లి-అద్దంకి బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలోనూ ధాన్యం నిల్వ ఉండటంతో అకాల వర్షాలకు తడిసింది.

రైతుల ఖాతాల్లో రూ.1,275కోట్లు జమ

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఇప్పటి వరకు మొత్తం రూ.1,275కోట్ల మేర రైతుల ఖాతాల్లో నగదు జమ అయినట్టు సమాచారం. పెండింగ్ ఎంత ఉందనేది అధికారుల వద్ద కూడా స్పష్టమైన సమాచారం లేదు.

● నల్లగొండ జిల్లాలో 5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యానికి 3,10,250మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. అందుకు రైతులకు రూ.668కోట్లకు రూ.644కోట్లు చెల్లించారు. ఇంకా రూ.24కోట్లు చెల్లించాల్సి ఉంది.

● యాదాద్రి జిల్లాలో 2,39,798మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా రూ.310కోట్ల వరకు చెల్లించారు. ఇంకా రూ.214కోట్లు చెల్లించాల్సి ఉంది.

● సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలంలో అత్యధికంగా 30వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. నూతనకల్, మద్దిరాల మండలాల్లోని పలు గ్రామాల్లోని ఐకేపీ కేంద్రాల్లో ఇంకా కొనుగోళ్లు జరుగుతున్నాయి. జిల్లాలో యాసంగిలో 3,82,542 ఎకరాల్లో వరిసాగైంది. 3,82,518 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వం 3,54,896 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలన్నది లక్ష్యం. అందుకు జిల్లాలో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 294 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 2,25,546 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. రైతుల నుంచి రూ.496కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించగా, ఇప్పటి వరకు రూ.358 కోట్లు చెల్లించారు. ఇంకా రూ.138కోట్లు చెల్లించాల్సి ఉంది.

సకాలంలో ఎగుమతి కావడం లేదు



గుండాల మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో సమస్యలు తీర్చాలి. ధాన్యం తీసుకువచ్చిన 20రోజుల తరువాతే తూకం వేశారు. లారీలు సకాలంలో రాకపోవడంతో ఎగుమతి కావడం లేదు. అధికారులు స్పందించి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేలా ఎప్పటికప్పుడూ చర్యలు తీసుకుంటేనే రైతుల ఇబ్బందులు తొలగుతాయి.

ఎలిపెద్ది సిద్ధారెడ్డి, రైతు, మాసన్‌పల్లి, గుండాల

ధాన్యం కొనుగోలు చేయాల్సిందే



రామన్నపేటలో రోడ్డెక్కిన రైతులు

రామన్నపేట: ధాన్యం ఎప్పుడు కొనుగోలు చేస్తారని, కేంద్రాల నుంచి ఎప్పుడు తరలిస్తారని రైతులు నిలదీశారు. ధాన్యం కొనుగోలు, తరలింపులో ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రైతు సంఘం(సీపీఎం అనుబంధం) ఆధ్వర్యంలో గురువారం యాదాద్రి జిల్లా రామన్నపేటలో రైతులు రోడ్డెక్కారు. ప్రధాన రహదారిపై రాస్తారోకో, తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఆందోళనలు విరమించాలన్న పోలీసులతో వాగ్వాదాలు, తోపులాటలు జరిగాయి. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జెల్లెల పెంటయ్య మాట్లాడుతూ మండలంలోని 26 కేంద్రాల్లో ధాన్యం పోసి రెండు నెలలు గడుస్తున్నా కొనుగోళ్లు చేయడం లేదని ఆరోపించారు. కొనుగోళ్లు జరగకపోవడం, లారీల కొరతతో ధాన్యాన్ని తరలించకపోవడంతో రైతులు రోజుల తరబడి ధాన్యం కుప్పల వద్దనే పడిగాపులు కాస్తున్నారన్నారు. ఇటీవల కురుస్తున్న అకాల వర్షంతో తడిసి ముద్దవుతున్న ధాన్యానికి ప్రభుత్వమే బాధ్యత వహిస్తూ, మద్దతు ధరతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేస్తామని అధికారులు ఇచ్చిన హామీతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, సింగిల్ విండో వైస్‌చైర్మన్ అంబటి ఉపేంద్రరవీందర్‌రెడ్డి, గన్నెబోయిన విజయభాస్కర్, సైదమ్మ, నగేష్, గాదె నరేందర్, తొలుపునూరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అన్నిరకాల ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలి

నల్లగొండ, యాదాద్రి జిల్లాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసనలు



దేవరకొండలో జరిగిన నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్

సంస్థాన్‌నారాయణపురం, దేవరకొండ, మిర్యాలగూడ, నాగార్జునసాగర్, మే 16: వరి అన్నిరకాల ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. కేవలం సన్న రకాల ధాన్యానికే రూ.500 బోనస్ ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గురువారం ఆందోళనలు కొనసాగాయి. సంస్థాన్‌నారాయణపురం మండల కేంద్రంలో నాయకులు ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ నర్రి నరసింహ, నాయకులు సుర్వి యాదయ్యగౌడ్, శ్రీరాముల నరసింహ, పాండు నాయక్, నలపరాజు రమేష్ సిద్ధగోని శ్రీను, బోడ రాజు, చిలువేరు భిక్షం, వీరమల్ల జంగయ్య, లక్ష్మారెడ్డి, బొడ్డుపల్లి గాలయ్య, జక్కిడి యాదిరెడ్డి, నలపరాజు స్వామి, ఉప్పల శ్రీను, వడ్డేపల్లి రాములు, రాసాల వెంకటేష్, బొమ్మగోని రమేష్, చంద్రశేఖర్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ జిల్లా దేవరకొండలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ మాట్లాడుతూ, పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన వెంటనే ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లిస్తానని ప్రకటించిన ప్రభుత్వం ఇప్పుడు సన్న రకాలకే ఇస్తామని ప్రకటించడం రైతులను మోసం చేయడమే అన్నారు. 90శాతం రైతులు దొడ్డు రకాలనే సాగుచేశారని, సన్నాలకే బోనస్ ఇస్తాననడం సరికాదన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, నాయకులు చింతపల్లి సుభాష్‌గౌడ్, జనార్ధన్‌రావు, వల్లపురెడ్డి, దస్రునాయక్, గాజుల ఆంజనేయులు, కేసాని లింగారెడ్డి, నట్వ గిరిధర్, రాజు, కృష్ణ, పాల్గొన్నారు. మిర్యాలగూడలో నాయకులు గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, జడ్పీటీసీ అంగోతు లలిత, పెండ్యాల పద్మ, అమరావతి సైదులు, చిట్టిబాబు నాయక్, యడవెల్లి శ్రీనివాసరెడ్డి, మోసిన్‌అలీ, పాలుట్ల బాబయ్య, నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, వెలిశెట్టి రామకృష్ణ, సాధినేని శ్రీనివాస్, పశ్య శ్రీనివాసరెడ్డి, దుర్గాప్రసాద్, పాల్గొన్నారు. నాగార్జునసాగర్ పైలాన్ కాలనీలో ప్రధాన రహదారిపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ హీరేకార్ రమేష్‌జీ, చంద్రమౌళి, గౌస్ శేఖరాచారి, లక్ష్మణ్, మంద శాంత, సైదులు, అంజయ్య, ప్రసాద్, ఏసు, ఏడుకొండలు, మురళీ, వీరయ్య, చాంద్‌పాష, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు. సూర్యాపేట జిల్లాలో నిరసన కార్యక్రమాలు చేపట్టలేదు.

సీఎం ప్రకటనతో రైతుల్లో ఆందోళన

మోత్కూరు: సన్న ధాన్యానికే క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో దొడ్డు రకాలను సాగుచేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏటా కేంద్ర ప్రభుత్వం పంటలకు మద్దతు ధర ప్రకటిస్తున్నా, అది గిట్టుబాటుకాక రైతులు నష్టాలపాలవుతున్నారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకి వస్తే ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. ఈ ఏడాది మార్చి చివరి వారం నుంచి యాసంగి వరికోతలు ప్రారంభమయ్యాయి. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో యాసంగి సీజన్ నుంచే ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తుందని రైతులు ఆశించారు. ఈలోగా పార్లమెంటు ఎన్నికలు రాగా, పలు ప్రచార సభల్లో బోనస్ విషయాన్ని సీఎం ప్రస్తావిస్తూ వానాకాలం సీజన్ నుంచే ఇస్తామని ప్రకటించారు. కాగా, ఈ నెల 14న సీఎం సన్న ధాన్యం పండించే రైతులకే రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వానాకాలం సీజన్‌లో వరిసాగులో సుమారు 20శాతమే సన్న రకాల వరి సాగు ఉంటుంది. యాసంగిలో 12శాతం కూడా ఉండదు. మిగతా మొత్తం దొడ్డు రకాలనే రైతులు సాగుచేస్తుంటారు. యాదాద్రి జిల్లాలో వానాకాలంలో సుమారు 3లక్షల ఎకరాల్లో వరి సాగవుతుండగా, అందులో 60వేల ఎకరాల్లో సన్నాలు సాగవుతుంటాయి. సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లోనూ సన్నాల సాగు 20 నుంచి 25 శాతానికి మించదు. గత ఏడాది వానాకాలంలో ప్రభుత్వ మద్దతు ధర రూ.2,203 ఉండగా, సన్న ధాన్యానికి బహిరంగ మార్కెట్‌లో రూ.2800 నుంచి రూ.3వేలు ధర పలికింది. రైతులు సన్న ధాన్యాన్ని ఒక్క బస్తా కూడా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించలేదు. అలాంటప్పుడు ప్రభుత్వం దొడ్డు రకం ధాన్యానికి బోనస్ ఇవ్వకుండా సన్నాలకు ఇస్తే తమకు ఒరిగేదేమిటని రైతులు పెదవి విరుస్తున్నారు.

సభలు, సమావేశాలకు అనుమతులు తప్పనిసరి

● ఎస్పీ చందనాదీప్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

నల్లగొండ టౌన్, మే 16: వరంగల్-ఖమ్మం-నల్లగొండ శాసనమండలి పట్టభద్రుల ఉపఎన్నికలో పోటీలో ఉన్న అభ్యర్థులు తప్పనిసరిగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని ఎస్పీ చందనా దీప్తి తెలిపారు. పోటీలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల నియమ నిబంధనల పరిధి దాటకుండా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లో ఉంటుందన్నారు. అభ్యర్థులు నిర్వహించే ర్యాలీలు, సభలు, సమావేశాలకు సంబంధిత అధికారుల అనుమతి తీసుకోవాలని, వారి ప్రసంగాల్లో ఎలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకూడదన్నారు. అభ్యర్థులు వారి ప్రచారంలో కులం, మతం, ఎదుటి వ్యక్తులను దూషించడం, ప్రార్థనా స్థలాల్లో ప్రచారం వంటివి చేయకూడదని, ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురి చేయవద్దన్నారు. ముందస్తు అనుమతి లేకుండా ఇతరుల ఇళ్ల గోడలపై రాతలు రాయటం, హోర్డింగులు ఏర్పాటు చేయడం వంటివి చేయవద్దన్నారు. సోషల్ మీడియాలో ఇతరులను కించపరిచే విధంగా పోస్టులు పెట్టరాదన్నారు. ఎన్నికలకు సంబంధించి ఏదైనా ఫిర్యాదులు చేయాల్సి వస్తే సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

నిరుద్యోగులను ముంచిన కేసీఆర్



- రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు
- పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న
- తీన్మార్ మల్లన్న గెలుపు కోసం కృషి చేయాలి : జానారెడ్డి

8

మోదీ పాలనలో ఆర్థికశక్తిగా దేశం



- అలవికాని హామీలతో బురిడీ కొట్టించిన రేవంత్‌రెడ్డి
- కాంగ్రెస్ పాలనలో ఎండిపోయిన పంటలు
- మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్

8

అవినీతిలేని సమాజ నిర్మాణమే లక్ష్యం



- పేదల కోసం పనిచేసేది కమ్యూనిస్టులే
- నన్నూరి అంజిరెడ్డి ఆశయాలు నెరవేర్చాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

8

ఎకోటూరిజం ఎన్నటికో?




నేరేడుగొమ్ము మండలం వైజాగ్‌కాలనీలో ఎకోటూరిజం ఏర్పాటు స్థలం

● కృష్ణానది తీరాన వైజాగ్‌కాలనీలో నిలిచిన పనులు



విక్రయానికి సిద్ధంగా ఉన్న చేపలు



దేవరకొండ, మే 16: నేరేడుగొమ్ము మండలం కృష్ణానది పరివాహక ప్రాంతం వైజాగ్‌కాలనీలో అటవీ అభివృద్ధి సంస్థ, పర్యాటకశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఎకోటూరిజం పనులు నిలిచాయి. ఇక్కడి పనులు పూర్తయితే పర్యాటకులకు ఆహ్లాదంతోపాటు స్థానికులకు ఉపాధి దొరుకుతుంది. నిలిచిన పనులను తిరిగి ప్రారంభించి ఎకోటూరిజంను అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.3.60కోట్లతో 17ఎకరాల స్థలంలో ఎకోటూరిజం పనులు ప్రారంభించారు. నాగార్జునసాగర్ బ్యాక్ వాటర్ పరిసరాల్లో ఎకోటూరిజం పనులు ప్రారంభం కావడంతో కృష్ణమ్మ అందాలను తనివితీరా ఆస్వాదించవచ్చని పర్యాటకులు ఆనందపడ్డారు. ఈ పనులు 40శాతం పూర్తికాగా, ఆరు నెలలుగా నిలిచిపోయాయి. అటవీ అభివృద్ధి సంస్థ రూ.60లక్షలతో ఫెన్సింగ్, రోడ్లు, విద్యుత్ పనులు కొంతమేర పూర్తయ్యాయి. ఇంకా 60శాతం పనులు చేపట్టాల్సి ఉంది. డైనింగ్, మీటింగ్ హాల్, రెస్టారెంట్లు, చిల్డ్రన్స్ పార్క్ నిర్మాణం, జనరల్ సఫారీ, రోడ్డు సౌకర్యం కల్పించాల్సి ఉంది. ఆరు నెలల క్రితం ఈ పనులు నిలిచిపోగా, నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా పనులు పూర్తవుతాయని స్థానికులు, పర్యాటకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఎకోటూరిజం పార్కు ప్రారంభమైతే వైజాగ్‌కాలనీ మత్స్యకారులతోపాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ఉపాధి లభిస్తుంది. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే బాలునాయక్ దృష్టిసారించి నిధులు కేటాయించాలని స్థానికులు, పర్యాటకులు కోరుతున్నారు.

వైజాగ్‌కాలనీలో వలస కూలీల కుటుంబాలు

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి విశాఖపట్నం ప్రాంతం నుంచి వలస వచ్చిన కుటుంబాల వారసులు ఇక్కడి వైజాగ్ కాలనీలో నివాసం ఉంటున్నారు. అంతకుముందు వీరు నాగార్జునసాగర్ బ్యాక్ వాటర్ పరిసర ప్రాంతాల్లో నివాసం ఉండగా, ముంపు కారణంగా వైజాగ్‌కాలనీకి వచ్చి స్థిరపడ్డారు. నాటుపడవలపై వెళ్లి చేపల వేట ద్వారా వీరు జీవనం సాగిస్తున్నారు. ఇక్కడ సుమారు 400 కుటుంబాలు నివాసం ఉంటుండగా, 100కుపైగా పడవలు ఉన్నాయి. పర్యాటకులు హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుంచి వైజాగ్‌కాలనీ కృష్ణాపరివాహక ప్రాంతానికి సెలవు దినాల్లో వస్తుంటారు. ఈ నేపథ్యంలో ఎకోటూరిజం పనులు పూర్తయితే వైజాగ్‌కాలనీకి పర్యాటకుల రద్దీ పెరిగి స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి.

వైజాగ్‌కాలనీకి ఇలా వెళ్లాలి..

నేరేడుగొమ్ము మండలం వైజాగ్‌కాలనీకి వెళ్లాలంటే తొలుత దేవరకొండ నుంచి 6కిలోమీటర్ల ఉన్న చందంపేట మండలం పోలేపల్లి గేటు వద్దకు చేరుకోవాలి. అటు నుంచి నేరేడుగొమ్ము మండలం పెద్దమునిగల్ గ్రామం మీదుగా 30కిలోమీటర్లు ప్రయాణిస్తే వైజాగ్‌కాలనీకి చేరవచ్చు. ఇక్కడి కొండలు, కృష్ణమ్మ అందాలను వీక్షించిన అనంతరం 40కిలోమీటర్ల దూరంలో ఉన్న దేవరచర్ల మునుస్వామి దేవాలయాన్ని దర్శించుకోవచ్చు. అంతేగాక ఇక్కడ లభించే పలు రకాల చేపల రుచిని కూడా ఆస్వాదించవచ్చు.



వైజాగ్‌కాలనీ కృష్ణాపరివాహక ప్రాంతంలో బోట్లు

పనులను పూర్తి చేయాలి



వైజాగ్‌కాలనీలో రూ.3.60కోట్లతో చేపట్టిన ఎకోటూరిజం పనులు కాలయాపన చేయకుండా పూర్తి చేయాలి. ఇది పూర్తయితే పర్యాటకుల రద్దీ పెరుగుతుంది. మాకు ఉపాధి లభిస్తుంది.

బొమ్ము అంజయ్య, వైజాగ్‌కాలనీ

జిల్లాలో పలుచోట్ల వాన



నల్లగొండలో కురుస్తున్న వాన

జిల్లాలోని పలు మండలాల్లో గురువారం వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత కొనసాగినా, సాయంత్రం ఒక్కసారిగా వాతవరణం చల్లబడింది. కొంతసేపటికి వాతావరణం మేఘావృతమై వాన పడింది. ఈదురుగాలులతో కూడిన వర్షంతో పలుచోట్ల తోటల్లో మామిడి కాయలు నేలరాలగా, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం బస్తాలు కొంత మేరకు తడిశాయి. మరింత నష్టం వాటిల్లక ముందే ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లాలోని రైతులు కోరుతున్నారు.

7









వరి కొయ్య.. కాలిస్తే అనర్థమే

- ● వేడికి సారం కోల్పోతున్న భూమి
- ● మంటలకు మాడిపోతున్న పోషకాలు
- ● నేలలో కలవకుండా దిగుబడిపై ప్రభావం
- ● రైతులకు అవగాహన కల్పిస్తామంటున్న వ్యవసాయ శాఖ

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట)

వరి కొయ్యలను కాల్చడం వల్ల భూమిలో సాయం తగ్గుతోంది. వరి కొయ్యలను కాల్చవద్దని వ్యవసాయ అధికారులు చెబుతున్నా రైతులు పట్టించుకోవడంలేదు. దీనిపై వ్యవసాయాధికారులు ప్రత్యేకంగా దృసి సారించాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సూచించారు. వరి కొయ్యలు తగలపెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూ సారం తగ్గడంతో పాటు భవిష్యత్‌లో భూమిలో పంట దిగుబడి కూడా గణనీయంగా తగ్గే ప్రమాదముంది. కొన్ని క్రితం ఆత్మకూర్(ఎస్) మండలం గట్టికల్ గ్రామంలో రైతు వరి కొయ్యలను తగలపెట్టాడు. ప్రమాదవశాత్తు మంటలు రాసుకొని ఊరు సమీపంలోకి పెద్ద ఎత్తున మంటలు లేచాయి. గ్రామస్థులు అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గత సంవత్సరం జిల్లాలో వరి కొయ్యల మంటల్లో, పొగ వల్ల ఇద్దరు రైతులు మృతిచెందారు. వరి కొయ్యలకు నిప్పు పెట్టడం వల్ల మోతె మండలంలోని పలు గ్రామాల్లో రోడ్డు పక్కన నాటిన హరితహారం మొక్కలు కూడా దగ్ధమయ్యాయి.



సూర్యాపేట మండలం రాజ్‌నాయక్‌తండగా సమీపంలో వరికొయ్యలకు నిప్పుపెట్టిన రైతులు

వానా కాలం సాగుకు సన్నద్ధం

యాసంగి సీజన్ మరో నెల రోజుల్లో పూర్తి కానుంది. వానకాలం సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. యాసంగి సీజన్‌లో వరి కోతలు పూర్తి కాగా పొలంలో మిగిలిపోయిన వరి కొయ్యలను రైతులు కాల్చివేస్తున్నారు. వరి కొయ్యలను కాల్చివేయడం వల్ల పంటలకు అధిక నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. కాగా గతంలో రైతులు వరిపంటను కొడవళ్లతో మొదళ్ల దాకా కోసేవారు. పశువులు ఎక్కువగా ఉండడంతో గడ్డిని కుప్పలు కుప్పలుగా పశుగ్రాసం కోసం వినియోగించేవారు. ప్రస్తుతం వ్యవసాయంలో అనేక విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకుంటునన నేపథ్యంలో గ్రామాల్లో పశువుల సంఖ్య తగ్గడంతో యంత్రాల వాడకం విపరీతంగా పెరిగింది. వరి పొలాన్ని కొయ్యడానికి మిషన్‌తో హార్వెస్టింగ్ చేసే సమయంలో వరి పొలాలను పైకి కొస్తున్నారు. మరో సీజన్ ప్రారంభంలో పొలం దున్నే సమయంలో నాగళ్లకు అడ్డుగా వస్తున్నాయని చాలా మంది రైతులు వరి కొయ్యలతో పాటు గడ్డి కూడా తగలబెడుతున్నారు. వరి కొయ్యలను కాల్చివేయడం వల్ల భూసారం తగ్గుతోంది.

భూ సారానికి ప్రమాదం

రైతులు వరి కొయ్యకాలకు నిప్పుపెట్టి బూడిద చేస్తుంటారు. ఇలా చేయడం వల్ల భూమిలో పంటకు ఉపయోగం అయ్యే క్రిమీ, కీటకాలు కూడా చనిపోతున్నాయి. దీని వల్ల పంటకు తీవ్ర నష్టం జరుగుతుంది. దీర్ఘకాలంలో రైతులు ఎక్కువగా నష్టపోతున్నారు. వరి కొయ్యలను కాల్చివేయడం వల్ల సేంద్రియ కర్బన శాతం పెరిగి గాలిలో చేరి, కాలుష్యం ఏర్పడుతుంది. అలా కాకుండా వరి కొయ్యకాలకు నిప్పు పెట్టకుండా వరి కొయ్యలను అలాగే పోలంలో నీటిని పెట్టి వరి కొయ్యలు కుళ్లిపోయేలా చేసి, దున్నితే సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది.

వరి కొయ్యలను కలియ దున్నితే అనేక ప్రయోజనాలు

వరి కొయ్యలను నేలలో కలియదున్నడం వల్ల సేంద్రియ కర్బనశాతం పెరిగి దిగుబడులు ఐదు నుంచి పది శాతం వరకు పెరిగే అవకాశముంది. దుక్కిదున్నే సమయంలో సింగిల్ సూపర్ ఫాస్పేట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో మురిగి పోషకాలుగా అందుబాటులోకి వస్తాయి. ఈ విధంగా చేయడం వల్ల రైతులపై డీపీపీ వాడక భారం తగ్గుతుంది. మొక్కలకు రెండు శాతం నత్రజని(యురియా) నాలుగు శాతం పాస్పరస్ అదనంగా అందిస్తుంది. నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. జింక్, మాంగనీస్, ఇనుము, కాల్షియం లాంటివి పంటకు మేలు చేస్తాయి. వరి కొయ్యలను భూమిలో కలియ దున్నడం వల్ల భూమిలో సూక్ష్మ జీవులు వృద్ధి చెందుతాయి. భూమికి నీటిని, పోషకాలను నిల్వ ఉంచే గుణం పెంచుతుంది. వాయు కాలుష్యం జరగకుండా ఉంటుంది. కొయ్యకాలు కుళ్లడంతో పంటకు ఎరువుగా ఉపయోగపడి దిగుబడులు పెరిగే అవకాశముంది.

అనర్థాలు అనేకం

వరి కొయ్యకాలకు నిప్పు పెడితే అనేక అనర్థాలకు దారి తీస్తుంది. వరి మొదళ్లలో నత్రజని, భాస్వరం, పోటాషియంతో పాటు సూక్ష్మజీవులు ఉంటాయని, మొదళ్లు కాల్చడం వల్ల ఈ పోషకాలు నేలలో కలవకుండా మంటలకు మాడిపోతాయిని అధికారులు పేర్కొంటున్నారు. వరి మొదళ్లను కాల్చివేయడం వల్ల మంటలు ఎగసిపడి వేడి తీవ్రతకు సూక్ష్మజీవులు చనిపోతాయి. రైతులు ఆశించిన మేర పంట దిగుబడి రాదు. తరచుగా గడ్డి కాల్చే పొలాల్లో నేల నీరు, గాలి వల్ల ఎక్కువగా కోతకు గురవుతాయి. తద్వారా నేలపై ఉండే సారవంతమైన పొర కొట్టుకుపోతుంది. గడ్డిని తిని బతికే కీటకాలు, పశువులకు ఆహార కొరత ఏర్పడే అవకాశం ఉంది. ఈ మంటల వల్ల అకస్మాత్తుగా గ్రామాల్లో అతి సమీపంలో గుడిసెలకు మంటలు అంటుకొని ఆస్తి నష్టం జరుగుతుంది. దీంతో పాటుగా బోరు పైపులు, కరెంటు తీగలు, మోటర్లతో పాటు హరితహార మొక్కలు, మామిడి తోటలు, ఇతర పండ్ల తోటలు కాలిపోయిన దాఖాలాలు అనేకం ఉన్నాయి.

వరి కొయ్యలను పొలంలోనే కలియ దున్నాలి

వానకాలం సీజన్‌కు సన్నద్ధమవుతున్న రైతులు యాసంగిలో వరి పొలాలు కోసి వేయగా మిగిలిన వరి కొయ్యలను కాల్చివేస్తున్నారు. వరి కొయ్యలను కాల్చివేయడం వల్ల పంట దిగుబడి తగ్గి, భూసారం తగ్గుతుంది. వరి కొయ్యలకు నీరు పెట్టి పొలంలోనే కలియ దున్నడం వల్ల సేంద్రియ ఎరువుగా మారి భూసారం పెరగడానికి దోహదం చేస్తుంది. వరి కొయ్యలను పొలంలోనే కుళ్లిపోయే విధంగా చేయడం వల్ల రైతులకు ఎరువుల భారం కొంతమేర తగ్గుతుంది. వరి కొయ్యలను కాల్చొద్దని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

● శ్రీధర్‌రెడ్డి, సూర్యాపేట జిల్లా వ్యవసాయాధికారి.

బుల్లెట్ బండి.. మంటలార్పునండి

దేవరకొండ, మే 16 : అగ్ని ప్రమాదాలను నివారించడంలో ఆధునిక బుల్లెట్ వాహనం ముందుంటుంది. ప్రమాద సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక వాహనానికి కంటే ముందే బుల్లెట్ వాహనం చేరుకుని మంటలను అర్పుతోంది. అన్ని అగ్నిమాపక కేంద్రాల్లో ఇటీవల అగ్నిమాపక వాహనంతో పాటు బుల్లెట్ వాహనాన్ని సైతం ఏర్పాటుచేశారు. ఈ బుల్లెట్ వాహనంలో రెండు సిలిండర్లు ఉంటాయి. ఒక్కో సిలిండర్‌లో ఫోమ్‌కెమికల్ నీటితో కలిపి 9 లీటర్లు నిల్వ ఉంటాయి. ప్రమాదం జరిగిన ప్రాంతం ఎంత చిన్నగల్లీఅయినా దూసుకెళ్లే అవకాశం ఉంటుండటంతో అగ్నిమాపక అధికారులు, బుల్లెట్ వాహనాన్ని ముందుగా పంపిస్తుంటారు. రెండు సిలిండర్లు కలిపి 18 లీటర్ల కెపాసిటీ ఉండడంతో సకాలంలో మంటలను ఆర్పేందుకు ఉపయోగపడుతుంది. ఆ తరువాత ప్రమాదం పెరిగితే పెద్ద వాహనం వచ్చి ప్రమాదాన్ని నివారిస్తుంది. నల్లగొండ దేవరకొండ అగ్నిమాపక కేంద్రం పరిధిలో బుల్లెట్ వాహనం ఈ ఏడాది జనవరి నుంచి 10 వరకు చిన్న, చిన్న అగ్నిప్రమాదాలను ఇళ్లలో, గల్లీల్లో జరిగిన అగ్నిప్రమాదాలను అరికట్టి ఆస్తి నష్టం జరగకుండా చూడగలిగింది. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు మొదటగా బుల్లెట్ వాహనం బయలుదేరుతుందని, దాని వెంట పెద్ద వాహనం వెళుతుందని దేవరకొండ అగ్నిమాపక అధికారి రాజు తెలిపారు.



నల్లగొండ అగ్నిమాపక కేంద్రంలోని బుల్లెట్ వాహనం

సాహసం శ్వాసగా... లక్ష్య సాధనకు

- ● ఏడు పర్వతాల లక్ష్యంలో ఐదో పర్వతం అధిరోహణకు సిద్ధం
- ● ఈ నెల 20న అమెరికా వెళుతున్న పర్వతారోహకురాలు అన్విత
- ● జూన్ 10లోగా పూర్తి చేసేందుకు ప్రణాళిక

భువనగిరి టౌన్, మే 16: ప్రపంచ పర్వతారోహణ రంగంలో అతి క్లిష్టమైన ఏడు ఖండాల్లోని ఏడు అత్యంత ఎత్తైన పర్వతాలను అధిరోహించే లక్ష్యంలో భువనగిరికి చెందిన పర్వతారోహకురాలు పడమటి అన్విత మరో సాహసానికి సిద్ధమయ్యారు. ఇప్పటివరకు నాలుగు పర్వతాలను అధిరోహించిన ఆమె ఐదో లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అమెరికాలోని అలస్కాకు శుక్రవారం బయలుదేరి వెళుతున్నారు. ఉత్తర అమెరికాలోని సముద్ర మట్టానికి 7వేల మీటర్ల ఎత్తులో ఉన్న డెనాలీ పర్వతాన్ని మే 20న అధిరోహించడం ప్రారంభించి, జూన్ 4 నుంచి 10వ తేదీ మధ్యన పూర్తి చేయనున్నారు. ఏడు పర్వతాల అధిరోహణ లక్ష్యంలో ఇప్పటివరకు ఆమె నాలుగు పర్వతాలను అధిరోహించారు. 2020 జనవరిలో 5,895 మీటర్ల ఎత్తులో ఉన్న కిలిమాంజారో (ఆఫ్రికా), 2021 డిసెంబరు 7న 5,642 మీటర్ల ఎత్తులో ఉన్న ఎల్‌బ్రస్ (యూరప్), 2022 మే 16న ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన 8,848.86 మీటర్ల మౌంట్ ఎవరెస్ట్(ఆసియా ఖండం), 2022 డిసెంబరు 17న 4,892 మీటర్ల ఎత్తైన విన్సన్ (అంటార్కిటికా) పర్వతాలను అధిరోహించారు. తాజాగా తన లక్ష్యసాధనలో ఐదో పర్వతమైన డెనాలీ పర్వత అధిరోహణకు ఎంచుకున్నారు. త్వరలోనే మిగతా రెండు పర్వతాలైన 6వేల మీటర్ల ఎత్తైన అకాంగోవా(సౌత్ ఆఫ్రికా), 2,228 మీటర్ల ఎత్తైన కోజిస్కో (ఆస్ట్రేలియాలో) పర్వతాలను అధిరోహించి లక్ష్యాన్ని సాధిస్తానని ధీమా వ్యక్తంచేస్తున్నారు. అన్విత ట్రాన్సెండ్ అకాడమీ ఆఫ్ రాక్ క్లైంబింగ్ (టార్క్) ఎండీ ఎవరెస్టర్ బి.శేఖర్‌బాబు పర్యవేక్షణలో భువనగిరి ఖిల్లాపై పర్వతారోహణలో ప్రాథమిక శిక్షణ పొందారు. 2015లో సిక్కింలోని 4,800 మీటర్ల ఎత్తైన రినాక్ పర్వతాన్ని, 2019లో పశ్చిమబెంగాల్‌లో 6,400 మీటర్ల బీసీరాయ్ పర్వతాన్ని, 2021 ఫిబ్రవరిలో లడక్‌లోని 6వేల మీటర్ల ఎత్తైన ఖడే పర్వతాన్ని, 2022 సెప్టెంబరు 21న మైనస్ చలిలో నేపాల్‌లోని 8,163 మీటర్ల ఎత్తులో ఉన్న మనస్లూ పర్వతాన్ని అధిరోహించిన తొలి భారతీయురాలిగా రికార్డును సొంతం చేసుకున్నారు. ఉస్మానియా యూనివర్శిటీ క్యాంపస్‌లో ఎంపీఏ పూర్తి చేసిన ఆమె తన 24వ ఏట పర్వతారోహణను ప్రారంభించారు. లక్ష్యసాధనను పూరిచేస్తూనే తాను శిక్షణ తీసుకున్న భువనగిరి ఖిల్లాపై రాక్ క్లైంబింగ్ చేసేవారికి కోచ్‌గా వ్యవహరిస్తున్నారు.



అంటార్కిటికాలోని విన్సన్ పర్వతంపై అన్విత (ఫైల్ ఫొటో)

కాంగ్రెస్ నాయకుడిపై గుర్తుతెలియని వ్యక్తుల దాడి

చౌటుప్పల్ రూరల్, మే 16: యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మునిసిపాలిటీలో కాంగ్రెస్ నాయకుడిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో బాధితుడికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు, పట్టణంలోని 10వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు పల్చం శ్రీనుముదిరాజ్ తెలిపిన వివరాల ప్రకారం గురువారం సాయత్రం నగేష్ టీస్టాల్‌లో శ్రీను టీ తాగుతుండగా ఓ వాహనంలో వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు ఒక్కసారిగా రాడ్లతో దాడి చేసి పరారయ్యారు. తీవ్రగాయాలైన శ్రీనును అనుచరులు చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. తనపై హైదరాబాద్‌కు చెందిన బాలు మహేంద్ర అనుచరులే తనపై దాడి చేశారని శ్రీను ఆరోపించారు. అనేక సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న తమ సోదరులకు కాకుండా ఇతర పార్టీల నుంచి వచ్చిన వారిని ఇన్‌చార్జిగా నియమించడంతో పోలింగ్ రోజున బాలుమహేంద్రతో గొడవ జరిగిందన్నారు.



గాయపడ్డ పల్చం శ్రీను

గుర్తుతెలియని మహిళా మృతదేహం లభ్యం

డిండి, మే 16 : నల్లగొండ జిల్లా డిండి రిజర్వాయర్‌లో గుర్తుతెలియని మహిళా మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌చార్జి ఎస్‌ఐ సతీష్ తెలిపారు. గురువారం ఉదయం రిజర్వాయర్‌లోకి వేటకు వెళ్లిన జాలర్లు మృతదేహాన్ని గుర్తించి సమాచారం ఇచ్చారన్నారు. మృతి చెందిన మహిళ వయస్సు 55 ఏళ్లు ఉంటుందని, 5.4 అడుగుల ఎత్తుతో పాటు ఉన్న ఆమె ఎరుపురంగు చీర, ఆకుపచ్చ రంగు జాకెట్, చేతులకు గోల్డ్‌కలర్‌లో ఉన్న గాజులు, కాళ్లకు చెప్పులు ధరించి ఉందన్నారు. మృతదేహం కొంతమేర కుళ్లినస్థితిలో ఉండటంతో రెండు, మూడు రోజుల కిందటే మృతి చెంది ఉంటుందని భావిస్తున్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శి జంగయ్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.







ఉమ్మడి జిల్లాలో వర్షం.. హర్షం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గురువారం సాయంత్రం వర్షం కురిసింది. ఉదయం నుంచి ఉక్కపోతగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతోపాటు మోస్తరు వర్షం పడింది. కొన్నిచోట్ల భారీ ఈదురుగాలులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మరికొన్ని చోట్ల భారీ వర్షం పడింది.



● గురువారం ఉదయం నుంచి ఉక్కపోత ● సాయంత్రానికి చల్లబడిన వాతావరణం ● పలుచోట్ల మోస్తరుతో పాటు భారీ వర్షం ● వానాకాలం సాగుకు ముందు వర్షాలు మంచివంటున్న రైతులు ● విద్యుత్ సరఫరాలో అంతరాయం



కేతేపల్లిల్లో కురుస్తున్న భారీ వర్షం

నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో తీవ్రమైన ఎండతో రోజంతా ఇబ్బంది పడిన ప్రజలు ఉపశమనం పొందారు. ఈదురు గాలులకు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కేతేపల్లిలో 65వ నెంబర్ జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న సర్వీసు రోడ్డుపై పెద్దఎత్తున వర్షపు నీరు నిలిచింది.

మునుగోడు : మండలంలోని పరిసర ప్రాంతంలో మోస్తరు వర్షం కురిసింది. సుమారు గంటన్నర పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈదురుగాలులకు కోత దశలో ఉన్న మామిడి, నిమ్మ తోటల్లో కాయలు నేలరాలాయి. పలుచోట్ల రైతులు ఆరుతడిగా సాగు చేసిన కూరగాయ పంటలు సైతం దెబ్బతి



వర్షానికి ముందు కమ్మిన మబ్బులు

న్నాయి. ఖరీఫ్ సీజన్‌కు ముందు కురిసే వర్షం పంటల సాగుకు అనువుగా ఉంటుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మర్రిగూడ: మండలంలో భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఐకేపీ కేంద్రాలు ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోళ్లు పూర్తి కాకపోవడంతో ఎరుగండ్లపల్లి, మర్రిగూడ కేంద్రాల్లో ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. భారీ వర్షానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

దేవరకొండ/కొండమల్లేపల్లి : దేవరకొండ, కొండమల్లేపల్లి పట్టణాల్లో గురువారం రాత్రి వర్షం కురిసింది. కొద్దిసేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొంది.



నల్లగొండలో గొడుగుల సహాయంతో వెళ్తున్న వాహనదారులు



నల్లగొండ క్లాక్‌టవర్ సెంటర్‌లో వర్షంలో వెళ్తున్న వాహనాలు

యాదాద్రిభువనగిరి జిల్లాలో



భువనగిరి టౌన్: భువనగిరి పట్టణంలో గురువారం సాయంత్రం అకస్మాత్తుగా వాతావరణం చల్లబడింది. భువనగిరి పట్టణంతో పాటు పరిసరాలలో చల్లటి తేలికపాటి ముసురు కురిసింది. దీంతో ప్రజలకు ఉక్కపోతనుంచి ఉపశమనం లభించింది. పలువురు ఆరుబయట కూర్చొని చల్లటి గాలులను ఆస్వాదించారు.

● ఆలేరు రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో కాంటా వేసిన ధాన్యం బస్తాలను ఎగుమతి చేయకపోవడంతో తడిసిపోయాయి.

● వలిగొండ : మండలంలో పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈదురు గాలులకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. అకాల వర్షానికి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం రాశులు తడవటంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. రెడ్లరేపాక మధిర గ్రామమైన మర్లపాడులోని కొమిరెల్లి రామిరెడ్డి ఇంటి పైకప్పు లేచిపోయింది.

సూర్యాపేట జిల్లాలో

సూర్యాపేటటౌన్ : జిల్లాలో పలుచోట్ల గురువారం సాయంత్రం వర్షం కురిసింది. ఆరు గంటల నుంచి వర్షం కురిసింది. సూర్యాపేట, హుజూర్‌నగర్, పాలకవీడులో వర్షం పడింది. తుంగతుర్తిలో సాయంత్రం నుంచి ఆకాశం మేఘావృతమైంది. పలు మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది.

కోదాడ రూరల్ : ఈదురు గాలులతో మామిడి తోటలకు భారీ నష్టం సంభవించింది. గురువారం సాయంత్రం పెద్దఎత్తున ఈదురు గాలులు వీచడంతో మండలంలోని కాపుగల్లు, రెడ్లకుంట, తొగర్రాయి, గణపవరం, గుడిబండ, నల్లబండగూడెం గ్రామాల్లో మామిడికాయలు రాలిపోయాయి. అసలే ఈ ఏడాది కొద్దోగొప్పో చెట్లకు కాసిన కాయలు కూడా రాలిపోవడంతో కౌలుకు తీసుకున్న మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. కాపుగల్లు గ్రామానికి చెందిన బాలెబోయిన రాజు ఈ ఏడాది ఎనిమిది ఎకరాల మామిడి తోటను కౌలుకు తీసుకుని సాగు చేశాడు. సరైన పూత, కాయ రాక కాసిన కొద్ది కాయలను కాపాడుకుంటూ వస్తున్నామని, ఈదురుగాలులతో కాయలు మొత్తం రాలిపోయాయని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తనకు సుమారు రూ.3 లక్షలకు పైగా పంటనష్టం జరిగిందని వాపోయారు. మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.



కాపుగల్లులో రాలిపోయిన మామిడి కాయలు ఏరుతున్న రైతులు

సాయం అందక ప్రాణం పోయింది

అరుదైన వ్యాధితో బాధపడుతూ చిన్నారి మృతి



భవిక్‌రెడ్డి(ఫైల్)

వలిగొండ, మే 16: ఆ చిన్నారికి ఊపిరి పోయాలంటే రూ.16కోట్లు కావాలి. ఆ పసివాడికి జీవితాన్ని ప్రసాదించాలని కన్నవారు దాతలు, ప్రభుత్వాన్ని వేడుకున్నా సకాలంలో ఆర్థిక సాయం అందకపోవడంతో మృత్యువుతో పోరాడి చివరికి అర్థాంతరంగా తనువు చాలించాడు. గ్రామస్థులు, బంధువుల వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పులిగిల్ల మధిర గోలిగూడేనికి చెందిన కొలను దిలీప్‌రెడ్డి, యామిని దంపతుల ఆరు నెలల కుమారుడు భవిక్‌రెడ్డి పుట్టినప్పటి నుంచి స్పైనల్ మస్క్యులర్ అట్రోపి (వెన్నెముఖ కండరాల క్షీణత) వ్యాధితో బాధపడుతున్నాడు. పుట్టిన మూడు నెలల తర్వాత ఈ ఆ వ్యాధి బయపటడింది. దీంతో పెద్ద పెద్ద ఆస్పత్రుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయింది. చివరగా వ్యాధిని నయం చేయడానికి ఇంజక్షన్‌కు రూ.16కోట్లు అవసరమని, ఆ మందులను అమెరికా నుంచి తెప్పించాలని డాక్టర్లు సూచించారు. అయితే వ్యవసాయ కుటుంబమైన వీరు ఆర్థికంగా వెనుకబడి ఉండడంతో, ఇంజక్షన్ కొనుగోలుకు ఓ ఫార్మా కంపెనీ రూ.10కోట్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని, మిగిలిన రూ.6కోట్లు కావాలని ఆర్థికసాయం కోసం సామాజిక మాధ్యమాల్లో వేడుకున్నారు. అయినా స్పందన లేకపోవడంతో చిన్నారి గురువారం మృతి చెందాడు. ఆ బాలుడి మృతితో బంధువులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

మూడేళ్లు జైలులో ఉండి వచ్చినా...



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ

మఠంపల్లి, మే 16 : చోరీలకు పాల్పడి మూడేళ్ల జైలు జీవితం అనుభవించినా బుద్ధిమారని ఓ దొంగను పోలీసులు పట్టుకున్నారు. ఓ రెస్టారెంట్‌లో చోరీ కేసులో మరోసారి అరెస్టయ్యాడు. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలో చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 9వ తేదీన స్థానిక సన్స్ రెస్టారెంట్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్న దేశబోయిన సంధ్య కౌంటర్‌లో రూ.2లక్షలు ఉంచి రెస్టారెంట్‌కు తాళం వేసి ఇంటికి వెళ్లింది. 10వ తేదీ ఉదయం వెళ్లి కౌంటర్ చూడగా నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని విచారణ ప్రారంభించారు. గురువారం మఠంపల్లి వై జంక్షన్‌లో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన రమావత్ సైదులు అలియాస్ రాముడు అనుమానాస్పదంగా కనిపించాడు. అదుపులోకి తీసుకుని విచారించగా రెస్టారెంట్‌లో చోరీ విషయం అంగీకరించాడు. చోరీ చేసిన నగదులో రూ.16వేలు విలాసాలకు ఖర్చు చేయగా, మిగిలిన రూ.1.84 లక్షలను సైదులు నుంచి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు. అయితే సైదులు గతంలో మోటార్ సైకిల్ దొంగతనాలు, హైదరాబాదులో తదితర ప్రాంతాల్లో చోరీలకు పాల్పడ్డాడని ఎస్ఐ తెలిపారు. ఇతడిపై ఇప్పటి వరకు 22 కేసులు ఉన్నాయని, మూడేళ్ల చర్లపల్లిలో జైలుజీవితం గడిపారని తెలిపారు. ఇటీవల విడు దలయ్యాక మట్టపల్లిలో నివాసముంటూ చోరీకి పాల్పడినట్లు ఎస్ఐ తెలిపారు.

పగపట్టి.. కుట్ర పన్ని హత్య

కొండమల్లేపల్లి, మే 16 : చిన్న చిన్న తగాదాల నేపథ్యంలో చోటుచేసుకున్న మనస్పర్థలతో ఏర్పడిన వైరం చివరికి హత్యకు దారి తీసింది. ఈ నెల 8న నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం అంగోతుతండాలో వృద్ధుడు జగ్రు హత్య కేసు మిస్టరీని ఛేదించిన పోలీసులు ఇరువురిని అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను దేవరకొండ డీఎస్పీ గిరిబాబు వెల్లడించారు. ఓ శుభకార్యంలో పాల్గొన్న అంగోతు జగ్రు, అతడి సోదరుడు తన పాలివారి కుమారుడైన అంగోతు బాలును చిన్న తగాదా విషయంలో కొట్టారు. అలాగే వీరిరువురి కుటుంబాల మధ్య పొలం గెట్టు పంచాయితీ నడుస్తోంది. తనను కొట్టడంతో పాటు గెట్టు పంచాయితీ పరిష్కారం కాకపోవడాన్ని జీర్ణించుకోలేకపోయిన బాలు తన బాబాయి కుమారుడైన తేజ సహాయంతో జగ్రును హతమార్చేందుకు కుట్రపన్నారు. ఈ క్రమంలోనే ఆదివారం జరిగే కొండమల్లేపల్లి సంతలో రెండు గొడ్డళ్లను కొనుగోలుచేశారు. జగ్రు హత్యకు పథకం రచించిన బాలు తేజ సహాయంతో ఈ నెల 8న తన ఇంటి ఎదుట మంచంపై నిద్రిస్తున్న జగ్రుపై గొడ్డళ్లతో తలపై విచక్షణా రహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్రగాయాలైన జగ్రు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు జగ్రు భార్య బుజ్జి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన పోలీసులు కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఈ కేసును ఛేదించేందుకు కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ్య నేతృత్వంలో ఎస్ఐ రామ్మూర్తి, గుడిపల్లి ఎస్ఐ ఆధ్వర్యంలో రెండు బృందాలుగా ఏర్పడి విచారణ ప్రారంభించారు. ఈ క్రమంలోనే కొండమల్లేపల్లిలో విచారణలో భాగంగా బాలును అదుపులోకి తీసుకున్న విచారించగా తేజ సహాయంతో జగ్రును హతమార్చినట్లు అంగీకరించినట్లు డీఎస్పీ తెలిపారు. జగ్రును హత్య చేసిన అనంతరం గొడ్డళ్లను సమీప పొలంలోని బోరు బావిలో పడేసినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా బాల నేరస్తుడైన తేజ కోసం పోలీసులు గాలింపు చేపడుతున్నారు. కాగా నిందితుడు బాలును రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులు హత్యకు వాడిన గొడ్డళ్లను మూడు గంటల పాటు శ్రమించి బావిలో నుంచి వెలికితీసిన పోలీసులు నిందితుడి నుంచి పల్సర్ బైక్, సెల్‌ఫోన్, రెండు గొడ్డళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసును ఛేదించిన సీఐ ధనుంజయ, ఎస్ఐలు రామ్మూర్తి, నర్సింహ, క్రైమ్ పార్టీ హేమూనాయక్, భాస్కర్, సత్యనారాయణ, గురువారెడ్డి, రవి, సైదులులను డీఎస్పీ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో బీజేపీ నాయకుడు మృతి



క్రాంతిరెడ్డి

సూర్యాపేటక్రైం, మే 16 : బైకును కారు ఢీకొన్న సంఘటనలో బీజేపీ నల్లగొండ పార్లమెంట్ సోషల్ మీడియా కోకన్వీనర్ మృతిచెందాడు. ఈ ప్రమాదం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ వద్ద గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పట్టణ ఇన్‌స్పెక్టర్ జీ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం ఆత్మకూర్(ఎస్)మండల కేంద్రానికి చెందిన కొప్పుల క్రాంతిరెడ్డి సూర్యాపేటలో విద్యానగర్‌లో అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు. నల్లగొండ పార్లమెంట్ బీజేపీ సోషల్‌మీడియా కోకన్వీనర్‌గా పనిచేస్తున్నాడు. అయితే బుధవారం తన స్నేహితుడి పెళ్లి రోజు ఉండడంతో వారి నివాసం వద్ద బుధవారం రాత్రి వరకు స్నేహితులతో ఉండి సంబరాల్లో పాలుపంచుకున్నాడు. అనంతరం అర్ధరాత్రి దాటిన తర్వాత బైక్‌పై కుడకుడ రోడ్డు నుంచి విద్యానగర్‌లోని ఇంటికి వెళ్తున్నాడు. ఆ సమయంలో విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న కారు కొత్తబస్టాండ్ వద్ద కొప్పుల క్రాంతిరెడ్డి ప్రయాణిస్తున్న బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో క్రాంతిరెడ్డి తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. క్రాంతిరెడ్డి తండ్రి నర్సిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద బీజేపీ నాయకులు క్రాంతిరెడ్డి మృతికి సంతాపం తెలిపారు.

కార్యకర్తకు కన్నీళ్లతో వీడ్కోలు పలికిన సంకినేని

ఆత్మకూర్(ఎస్) : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బీజేపీ నల్లగొండ పార్లమెంట్ సోషల్‌మీడియా కోకన్వీనర్ కొప్పుల క్రాంతిరెడ్డి అంత్యక్రియలు ఆయన స్వగ్రామం ఆత్మకూర్(ఎస్) గ్రామంలో గురువారం నిర్వహించారు. మృతదేహానికి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు, బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతిమయాత్రలో పందిరి రాంరెడ్డి, కిషన్, వీరేందర్, సైదులు, దనుంజయగౌడ్, కర్ణాకర్, కృష్ణ, రవి, వీరారెడ్డి, పాల్గొని పార్టీలో తమతో కలిసి పనిచేసిన క్రాంతిరెడ్డికి కన్నీటితో వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సంకినేని దంపతులు క్రాంతిరెడ్డిని తలుచుకుని కన్నీటిపర్యంతం అయ్యారు.

బైక్‌ను ఢీకొట్టి.. 10మీటర్లు ఈడ్చుకెళ్లి...



దగ్ధమవుతున్న బైక్

చౌటుప్పల్ రూరల్, మే 16 : యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలో ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో దంపతులకు తీవ్రగాయాలు కాగా బైక్ పూర్తిగా దగ్ధమైంది. 10మీటర్లకు పైగా లారీ బైక్‌ను ఈడ్చుకెళ్లటంతో పెట్రోల్ ట్యాంక్ పగిలి బైక్ దగ్ధమైంది. ఈ సంఘటనతో హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై వాహన రాకపోకలు కొద్దిసేపు నిలిచిపోయాయి. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లాకు చెందిన దంపతులు కలిక శ్రీనివాస్(59), కలిక విజయలు హైదరాబాద్ ఉప్పుగూడలో నివాసం ఉంటున్నారు. మూడు నెలల కిందట స్వగ్రామానికి వెళ్లి బైక్‌పై వస్తున్నారు. ఈ క్రమంలో చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట సమీపంలో బైక్‌ను వెనుకనుంచి ట్యాంకర్ లారీ ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న దంపతులు ఎడమవైపున పడిపోగా, బైక్‌ను లారీ ఈడ్చుకెళ్లింది. సుమారు 10 మీటర్లకు పైగా ఈడ్చుకెళ్లడంతో రోడ్డుకు రాపిడికి బైక్ పెట్రోల్‌ట్యాంక్ పగిలి మంటలు చెలరేగాయి. దీంతో మంటలు చెలరేగి బైక్ పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనతో జాతీయ రహదారిపై కొద్దిసేపు హైదరాబాద్ వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. గాయాలపాలైన దంపతులను హైదరాబాద్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యాదగిరికొండపై శాస్త్రోక్తంగా నిత్యపూజలు



గజవాహన సేవ నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, మే 16: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో గురువారం శాస్త్రోక్తంగా నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలు పాంచరాత్రాగమ రీతిలో వైభవంగా కొనసాగాయి. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రాలతో దివ్యమనోహరంగా అలంకరించిన ఆచార్యులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం నిర్వహించారు. ఉత్సవమూర్తులను కల్యాణమండపంలో అధిష్ఠింపజేయగా విశ్వక్సేనుడికి తొలిపూజతో కల్యాణతంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు అర్చకులు స్వామివారి శేషవస్త్రాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం నిర్వహించారు. ప్రభాత వేళ గర్భాలయంలోని స్వయంభువులను సుప్రభాతంతో మేల్కొలిపిన అర్చకస్వాములు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో సాంప్రదాయరీతిలో నిత్యపూజలు వైభవంగా జరిపించారు. యాదగిరికొండపై ఉన్న శివాలయంలో రామలింగేశ్వరస్వామికి నిత్యపూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం, శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. కాగా, టెండర్ల (లీగల్ లీజెస్) ద్వారా రూ.26,46,192లతో పాటు ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.54,93,945 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

తూర్పు ఈశాన్య దిశలో సంగీత వేదిక

ప్రతీ శుక్ర, శని, ఆదివారాలతో పాటు ప్రత్యేక, పండగ రోజుల్లో భక్తుల కాలక్షేపంతో పాటు ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, లలిత కళల ప్రదర్శనలకు ఆలయ తూర్పు ఈశాన్య దిశలో సంగీత వేదికను నిర్మిస్తున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఈవో భాస్కర్‌రావు పరిశీలించారు.

రిజిస్ట్రేషన్ ఆపాలని తల్లీకుమార్తెల ఆత్మహత్యాయత్నం

● అడ్డుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు



ఆత్మహత్యాయత్నం చేసిన తల్లీకుమార్తెలు

శాలిగౌరారం, మే 16 : నల్లగొండ జిల్లా శాలిగౌరారం తహసీల్దార్ కార్యాలయంలో తల్లీకుమార్తెలు ఆత్మహత్యకు యత్నించారు. అక్కడే ఉన్న పోలీసులు, రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం తక్కెళ్లపహాడ్ గ్రామానికి చెందిన పులిగిళ్ల బాలయ్యకు నకిరేకల్ మండలం తాటికల్ గ్రామానికి చెందిన శిరీషతో వివాహమైంది. 2004లో ఆకస్మాత్తుగా శిరీష మృతి చెందగా అప్పటికే ఆమెకు కుమార్తె ఉంది. దాంతో బాలయ్య మండలంలోని తక్కెళ్లపహాడ్ గ్రామానికి చెందిన అన్నపూర్ణను 2005లో వివాహం చేసుకున్నాడు. అన్నపూర్ణకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ క్రమంలో బాలయ్యకు ఉన్న 30గుంటల భూమిని మొదటి భార్య సంతానమైన కుమార్తె అఖిల పేరు మీద 10గుంటల భూమి, బాలయ్య అక్క పేరు మీద 10గుంటల భూమిని రిజిస్ట్రేషన్ చేసేందుకు గత నెల ఏప్రిల్ 19న స్లాట్ బుక్ చేయగా 20న రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు సమయం ఇచ్చారు. విషయం తెలుసుకున్న రెండో భార్య అన్నపూర్ణ ఆ రిజిస్ట్రేషన్ ఆపాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో, తహసీల్దార్ కూడా ఫిర్యాదు చేసింది. అదేవిధంగా నకిరేకల్ కోర్టును సైతం ఆశ్రయించినట్లు తెలిపారు. ఈ విషయంపై అన్నపూర్ణ విన్నపం మేరకు తహసీల్దార్ పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడుకోవాలని కొంత సమయం ఇచ్చారు. బాలయ్య పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడుకునేందుకు రాకుండా గురువారం సాయంత్రం శాలిగౌరారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేయించేందుకు సిద్ధమయ్యాడు. విషయం తెలుసుకున్న అన్నపూర్ణ ఆమె కుమార్తె తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. ఆ రిజిస్ట్రేషన్ ఆపాలంటూ తమకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తూ తహసీల్దార్ ఛాంబర్‌లోనే తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ బాటిల్‌ను ఇద్దరిపై పోసుకుని ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డారు. వెంటనే అక్కడే ఉన్న పోలీసులు, అధికారులు తల్లీ కుమార్తెలను అడ్డుకుని ఆమెకు నచ్చజెప్పారు. విషయం తెలుసుకున్న పలువురు అక్కడే ఉన్న బాలయ్యపై దాడి చేసి గాయపర్చారు.

తహసీల్దార్ వివరణ

ఈ విషయంపై తహసీల్దార్ అన్వర్ హుస్సేన్‌ను వివరణ కోరగా రిజిస్ట్రేషన్ ఆపే హక్కు తనకు లేదన్నారు. ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు తాను చర్యలు తీసుకుంటానన్నారు.

కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య..



సతీష్‌చారి(ఫైల్)

తిప్పర్తి, మే 16 : కడుపునొప్పి భరించలేక రైలుకింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలో గురువారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తిప్పర్తి మండలంలోని కంకణాలపల్లి గ్రామానికి చెందిన పోతుగంటి సతీష్‌చారి(35) కులవృత్తి అయిన కార్పెంటర్ పనిని చేస్తూ అదే గ్రామంలో జీవనం కొనసాగిస్తున్నాడు. కాగా అతడు బుధవారం రోజు ఉదయం నుంచి రాత్రి వరకు కడుపునొప్పిగా ఉందని చెప్పి రాత్రి పడుకోకుండా 12 గంటల వరకు ఇంట్లోనే ఉన్నాడు. తెల్లవారి లేచి చూసేసరికి ఇంట్లో కనిపించలేదు. అయితే గ్రామ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద సతీష్‌చారి మృతదేహాన్ని గుర్తించిన గ్రామస్తులు ఆయన భార్య ఉమారాణికి సమాచారం అందించారన్నారు. ఆ మేరకు ఆమె ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. సతీష్‌చారికి భార్యతో పాటు పాప, బాబు సంతానం ఉన్నారు.

బీఆర్ఎస్ గెలుపు ఖాయం: హరీష్‌రావు



తిరుమాడవీధుల్లో ప్రదక్షిణలు చేస్తున్న హరీష్‌రావు

భువనగిరి అర్బన్, మే 16: పార్లమెంట్, ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు ఖాయమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. గురువారం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డితో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయగా, వేద పండితులు వేద ఆశీర్వచనం చేశారు. స్థానిక మీడియా ప్రతినిధులు ఆయన్ను పలకరించగా, దర్శనానికి వచ్చానని, రాజకీయాలు మాట్లాడనని చెబుతూనే... బీఆర్ఎస్ వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ అధికారం చేపట్టబోతోందన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు కర్రె వెంకటయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీది రవీందర్, కొండల్‌రెడ్డి, బాబురావు తదితరులు ఉన్నారు.

సరిహద్దులో చెక్‌పోస్టు తొలగింపు



చెక్‌పోస్ట్‌ను తొలగించి, సామాన్లు తరలిస్తున్న దృశ్యం

కోదాడ రూరల్, మే 16 : సూర్యాపేట జిల్లా కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన సరిహద్దు చెక్‌పోస్టును అధికారులు గురువారం తొలగించారు. సుమారు నెలరోజుల కిందట ఎన్నికల కోడ్ నేపథ్యంలో అధికారులు ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చే వాహనాలను ఇక్కడ తనిఖీ చేసి నగదు కానీ, వస్తువులు కానీ లభిస్తే పోలీసులు స్వాధీనం చేసుకుని ఎన్నికల సిబ్బందికి అప్పగించేవారు. ఈ చెక్‌పోస్ట్‌లో గెజిటెడ్ స్థాయి అధికారి పర్యవేక్షణలో మరో నలుగురు వివిధ శాఖల నుంచి ఉద్యోగులు విధులు నిర్వర్తించేవారు. ఎనిమిది గంటల డ్యూటీ విధానంలో మూడు షిఫ్టులుగా పనిచేశారు. చెక్‌పోస్టులో పెద్దఎత్తున నగదుతో పాటు పలురకాల వస్తువులు, దుస్తులు, దుప్పట్లు, బంగారు ఆభరణాలు సైతం స్వాధీనం చేసుకుని ఎన్నికల అధికారులకు అప్పగించారు. పోలింగ్ ప్రక్రియ పూర్తి కావడంతో చెక్‌పోస్టును తొలగించినట్లు అధికారులు తెలిపారు.

ప్రమాదవశాత్తు గీత కార్మికుడికి గాయాలు

భువనగిరి అర్బన్, మే 16: యాదాద్రిభువనగిరి జిల్లాలో తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడు మృతి చెందాడు. యాదగిరిగుట్ట పట్టణ పరిధి కొత్త గుండ్లపల్లికి చెందిన గంధమల్ల నరేష్(30) గురువారం తాటిచెట్టు పైనుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. నిత్యం కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తు కిందజారీ పడిపోయాడు. నరేష్‌ను కుటుంబసభ్యులు భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

నిరుద్యోగులను నిండా ముంచిన కేసీఆర్

● ఇసుక, భూదందాలే బీఆర్‌ఎస్ కమిట్‌మెంట్
● పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న
● తీన్మార్ మల్లన్న గెలుపు కోసం కృషి చేయాలి: సీఎల్పీ మాజీ నేత జానా


హాలియాలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి, పక్క ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న

హాలియా, మిర్యాలగూడ, దేవరకొండ, మే 16: ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకుండా నిరుద్యోగులను నిండాముంచింది కేసీఆర్ ప్రభుత్వమేనని నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అన్నారు. జిల్లాలోని హాలియా, మిర్యాలగూడ, దేవరకొండ పట్టణాల్లో గురువారం నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తే పదేళ్లలో 6 లక్షల కోట్ల అప్పులు మిగిల్చారని విమర్శించారు. రాష్ట్రాన్ని కేసీఆర్, కేటీఆర్‌లు దోచుకొని తిని అప్పులపాలు చేశారని అన్నారు. రాష్ట్ర ఆర్థిక స్థితిని గాడిలో పెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. అధికారంలోకి రాలేదనే ఒత్తిడిలో కేసీఆర్, కేటీఆర్‌లు ఏం మాట్లాడుతున్నారో అర్థంకావడం లేదన్నారు. నేను నిరుద్యోగుల పక్షాన పోరాడినందుకు జైలుకు పంపారు కానీ కవిత లిక్కర్ స్కామ్‌లో జైలుకు వెళ్లి తెలంగాణ ఆడబిడ్డలకు తలవంపులు తెచ్చిందన్నారు. 2021లో పట్టభద్రులు నమ్మకంతో పల్లాకు ఎమ్మెల్సీ పదవి ఇస్తే నట్టేట ముంచి పోయినందునే ఉపఎన్నిక వచ్చిందన్నారు. తిరిగి ఏ ముఖం పెట్టుకొని బీఆర్‌ఎస్ నేతలు ఎమ్మెల్సీ ఎన్నికలో ఓటు అడుగుతారని ప్రశ్నించారు. ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్ విడుదలకు కృషి చేస్తానని, 2 లక్షల ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేసేలా చూస్తానని అన్నారు. సీపీఎస్ స్థానంలో ఓపీఎస్ అమలుకు కృషి చేస్తామన్నారు. 317 జీవో ద్వారా ఉద్యోగులకు ఇబ్బందులు కలిగాయని వాటిని సరి చేస్తామన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యలను పట్టించుకోలేదన్నారు. ఉద్యోగులకు బీఆర్‌ఎస్ పాలనలో జీతాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉండేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 1వ తేదీనే జీతాలు ఇస్తున్నారని పేర్కొన్నారు. కేటీఆర్ మాయమాటలు చెప్పి అబద్ధపు ప్రచారం చేసి ఓడించాలని కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. కేటీఆర్ మాయమాటలు పట్టభద్రులు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో తనకు ఓటు వేసి గెలిపించాలని మల్లన్న కోరారు.

● మిర్యాగూడలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నార్కట్‌పల్లి- దామరచర్ల వరకు పారిశ్రామిక కారిడార్‌గా ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనకై దామరచర్ల ప్రాంతంలో ఉన్న 3 వేల ఎకరాల్లో డ్రైపోర్ట్ నిర్మాణానికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షైబెల్లి, చిలుకూరి బాలు, నూకల వేణుగోపాల్‌రెడ్డి , గాయం ఉపేందర్‌రెడ్డి, దేశిడి శేఖర్‌రెడ్డి,తమ్మడబోయిన అర్జున్, పొదిల శ్రీనివాస్, గంధం రామకృష్ణ, బెజ్జం సాయి, ఎంపీపీ నందిని, సిద్దూనాయక్ పాల్గొన్నారు.

● హాలియాలో పట్టణంలో నిర్వహించిన సమావేశంలో సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి మాట్లాడు తూ ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపు కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అనుముల మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొండేటి మల్లయ్య, జడ్పీ వైస్‌చైర్మన్ ఇరిగి పెద్దులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, భాస్కర్‌నాయక్, యడవల్లి రంగసాయిరెడ్డి, కాకునూరి నారాయణగౌడ్, మేరెడ్డి వెంకటరాహుల్‌రెడ్డి, రావుల చినబిక్షం, శంకర్‌నాయక్, యడవల్లి అనుపమనరేందర్‌రెడ్డి, అన్నపూర్వన, చింతల చంద్రారెడ్డి, గౌని రాజారామేష్‌యాదవ్, అబ్బిడి కృష్ణారెడ్డి, రామేశ్వరీ, భారతిభాస్కర్‌నాయక్, భగవాన్‌నాయక్, అనుముల పాండమ్మ, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● దేవరకొండలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం ప్రాజెక్టులకు నిధులు కేటాయించలేదని ఆరోపించారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం రిజర్వేషన్లు రద్దు చేసి గిరిజనులు, దళితులు, వెనుకబడిన వర్గాలను మోసం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గుత్తా అమిత్‌రెడ్డి, డాక్టర్ వేణుధర్‌రెడ్డి, సిరాజ్‌ఖాన్, సీపీఐ నేత పల్లా నర్సింహారెడ్డి, ఆంజనేయులు, పల్లె నర్సింహ, హనుమంతు వెంకటేష్‌గౌడ్, జాల నర్సింహారెడ్డి, పున్న వెంకటేష్, యూనుస్, సీపీఐ, కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు, పట్టభద్రులు తదితరులు పాల్గొన్నారు.

24న నూతన ఎంపీపీ ఎంపిక

మర్రిగూడ, మే 16: మర్రిగూడ మండల ఎంపీపీ ఎన్నిక ఈ నెల 24న నిర్వహించనున్నారు. అప్పటి ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డిపై సొంత పార్టీ అయిన బీఆర్ఎస్ ఎంపీటీసీలు గత ఏడాది నవంబర్ 13న అవిశ్వాస తీర్మాన పత్రాన్ని దేవరకొండ ఆర్డీవోకు అందజేశారు. మెండు మోహన్‌రెడ్డి కోర్టును ఆశ్రయించడంతో అవిశ్వాస తీర్మానం వాయిదా పడింది. కోర్టు అనుమతి మేరకు ఈ ఏడాది మార్చి 30న మోహన్‌రెడ్డిపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. వైస్ ఎంపీపీ కట్కూరి వెంకటేష్‌కు ఏప్రిల్‌లో ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకున్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశాల మేరకు ఈ నెల 24వ తేదీన ఎంపీపీ ఎన్నిక నిర్వహించుకోవచ్చని జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. మర్రిగూడ ఎంపీపీ రేసులో ఉన్న తిరుగండ్లపల్లి ఎంపీటీసీ గండికోట రాజమణిహరికృష్ణకు ఏడుగురు ఎంపీటీసీలు మద్దతు పలుకుతున్నారు. అవిశ్వాస తీర్మానం పెట్టిన ఐదుగురు ఎంపీటీసీలు అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరడంతో మొత్తం ఏడుగురు ఎంపీటీసీలు కాంగ్రెస్ వైపే ఉన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సైదులుగౌడ్

మిర్యాలగూడటౌన్, మే 16: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులుగౌడ్ కోరారు. ఎన్నికల తంతు ముగిసిన నేపథ్యంలో ప్రభుత్వం విద్యారంగంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యాలయాల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటు, పుస్తకాలు, యూనిఫాం పంపిణీ, ఫీజు బకాయిల విడుదలపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కర్నాటి శివరామకృష్ణ, వడ్డెబోయిన సతీ ష్‌కుమార్, మహ్మద్ బాషా పాల్గొన్నారు.

'మధ్యాహ్న' కార్మికుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి


కార్మికులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

నిడమనూరు, మే 16: హైదరాబాద్‌లో ఈ నెల 19, 20వ తేదీల్లో నిర్వహించనున్న మధ్యాహ్న భోజన కార్మికుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సీఐటీ యూ జిల్లా కార్యదర్శి పోలే సత్యనారాయణ కోరారు. గురువారం నిడమనూరులో జరిగిన మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు ప్రభుత్వం నుంచి సకాలంలో బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, ప్రతీ నెలా 5వ తేదీలోగా బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సదస్సుకు భారీగా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ఊటుకూరు వెంకటమ్మ, కార్యదర్శిగా కందుల సైదమ్మ, కోశాధికారి వట్టికోటి అంజమ్మ, సభ్యులుగా జగదాంబ, సైదమ్మ, సుజాత, ప్ర మీల, సునీత, ఈదమ్మ, ఎల్లమ్మ ఎన్నికయ్యారు. సమావేశంలో కొమాండ్ల గుర్వ య్య, కందుకూరి కోటేష్ పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

డిండి, మే 16: డిండి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ లక్ష్మణస్వామి తెలిపారు. డ్రాఫ్స్‌మెన్ సివిల్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, స్టెనోగ్రాఫర్, వెల్డర్, ట్రేడ్‌లలో మొదట విడత సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. 8, 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండి 14 సంవత్సరాల వయస్సు పైబడిన వారు ఈ నెల 16 నుంచి జూన్ 10వ తేదీ వరకు ఐటీఐలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 10వ తరగతి మెమో, ఆధార్‌కార్డు ఉండాలని తెలిపా రు. దరఖాస్తు వెరిఫికేషన్ కోసం వంద రూపాయలు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని ఆయన కోరారు.

దత్తాశ్రమంలో వార్షికోత్సవ పూజలు

మిర్యాలగూడ టౌన్, మే 16: పట్టణంలోని రైల్వేకాలనీ శ్రీ సాయిదత్తాశ్రమంలో వార్షికోత్సవ పూజలు వైభవంగా నిర్వహించారు. ఆశ్రమంలో నాగసాయి విగ్రహ ప్రతిష్ఠ జరిగి 14 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆలయంలో పల్లకి సేవ, పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన కార్యదర్శి నరేందర్ సాయినాథునికి 21 కిలోల పూలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పందిరి సత్యనారాయణ, శ్రీనివాస్, సోమన్న, జగన్నాధరావు, రవి, విక్రమ్, అంజిబాబు, కిరణ్, అరుణ, భాగ్యలక్ష్మి, పద్మ, కల్యాణి, భవాని, శారద తదితరులు పాల్గొన్నారు.


సాయిదత్తాశ్రమంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న భక్తులు

మోదీ పాలనలో ఆర్థికశక్తిగా ఎదిగిన దేశం

● మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి రాజేందర్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

నల్లగొండ, మే16: ప్రధాని నరేంద్ర మోదీ పాలనలోనే దేశం 5వ ఆర్థిక శక్తిగా ఎదిగిందని మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి, మాజీ మంత్రి ఈటెల రాజేందర్ అన్నారు. పట్టభద్రుల ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం నల్లగొండ పట్టణానికి వచ్చారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ బీజేపీలో 40 సంవత్సరాలుగా ఒడిదుడుకులు, కష్ట నష్టాలు ఎదురైనా బెదరకుండా పార్టీ సిద్ధాంతం కోసం పని చేశారని అన్నారు. ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల్లోని 34 నియోజకవర్గాల్లో 34 ఇన్‌చార్జులు 10 రోజులుగా ప్రేమేందర్ గెలుపునకు పనిచేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలో యువతలో బీజేపీనే గెలిపించాలన్న సంకల్పం బలంగా ఉందన్నారు. మోదీ నాయకత్వంలో ఆత్మగౌరవం పెరగడమే కాకుండా దేశాన్ని సమున్నతంగా నిలిపారని పేర్కొన్నారు. ఇక తెలంగాణలో అతి తక్కువ కాలంలో ప్రజల చేత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఛీ కొట్టించుకున్నారని అన్నారు. అలవికాని హామీలతో ప్రజలను బురిడీ కొట్టించారని విమర్శించారు. కేసీఆర్ మీద వ్యతిరేకతతోనే ప్రజలు కాంగ్రెస్‌కి ఓటు వేశారు తప్ప ఇష్టంతో ఎవరూ వేయలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పా లనలో కాలిపోయిన మోటార్లు, ఎండిపోయిన పంటలు దర్శనమిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో 12 స్థానాల్లో బీజేపీ గెలవబోతుందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, నాయకులు వెంకటేష్ మాట్లాడుతూ బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించుకోవాలని సూచించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రేమందర్‌రెడ్డి మాట్లాడుతూ మేధావులు, యువత ఈ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ నల్లగొండ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, రాష్ట్ర నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, పిల్లి రామరాజు, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, నూకల వెంకటనారాయణరెడ్డి, పల్లెబోయిన శ్యాంసుందర్, వంగూరి రాఖీ, పోతేపాక సాంబయ్య, పెరిక మునికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలను సవాళ్లుగా స్వీకరించాలి

● మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నల్లగొండ, మే 16: ఎన్నికలను సవాళ్లుగా స్వీకరించాలని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ గెలుపుతో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పనిచేస్తారని అన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత పట్టభద్రుల ఎన్నికల్లో రెండు సార్లు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలిచారని, ఈ ఉప ఎన్నికలో కూడా సమర్థవంతంగా పనిచేసే రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అందుకే ఈ ఎన్నికలను సవాళ్లుగా స్వీకరించాలన్నారు. ప్రతీ పట్టభద్రుని కలిసి ఓటు అభ్యర్థించాలని కోరారు. సమావేశంలో మునిసిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, ఉపాధ్యక్షురాలు యాట జయప్రదారెడ్డి, మండల అధ్యక్షుడు దేప వెంకట్‌రెడ్డి, నాయకులు నారబోయిన భిక్షం, కాంచనపల్లి రవీందర్‌రావు, కొండూరు సత్యనారాయణ, గణేష్, శ్రీనివాస్, జాఫర్, లక్ష్మయ్య, కృష్ణ, శంకర్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ప్రశ్నించే వారిని గొంతులకు మద్దతివ్వాలి: రవీంద్రకుమార్

దేవరకొండ: ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుకలకు మద్దతివ్వాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్ అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా దేవరకొండలో గురువారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో రాకేష్‌రెడ్డిని గెలిపించాలని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా దేవరకొండలో గురువారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువకుడు, ఉత్సాహవంతుడైన రాకేష్‌రెడ్డిని శాసనమండలికి పంపించాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో గ్రంథాలయ జిల్లా మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, నాయకులు చింతపల్లి సుభాష్‌గౌడ్, గాజుల రాజేష్, చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతయ్య, కేసాని లింగారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ప్రశ్నించే గొంతును గెలిపించాలి

● ద్యాబ్ ప్రధాన కార్యదర్శి పొనుగోటి చొక్కారావు


ఎమ్మెల్సీ అభ్యర్థిని కలిసిన ద్యాబ్ ప్రధాన కార్యదర్శి చొక్కారావు

నల్లగొండ, మే 16: పట్టభద్రులు ప్రశ్నించే గొంతుక అయిన వరంగల్ - ఖమ్మం - నల్లగొండ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ద్యాబ్ ప్రధానకార్యదర్శి పొనుగోటి చొక్కారావు కోరారు. గురువారం గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని కలిశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. 33 సంవత్సరాలు చదువు నేర్పిన విద్యార్థులందరూ ఓటు వేయాలని, పట్టభద్రుల సమస్యలు పరిష్కారం కావాలంటే ప్రేమేందర్‌రెడ్డి గెలిపించాలని కోరారు. ప్రేమేందర్‌రెడ్డి ఓటు వేస్తే అదే తనకు గురుదక్షిణగా భావిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, నాయకులు పి.దామోదర్‌రావు, గోలి మధుసూదన్‌రెడ్డి, వేరేపల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు చిట్టీలు తీసుకోవాలి

డిండి, మే 16: ఈ నెల 27వ తేదీన వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేవారు తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు స్లిప్పు పొందాలని తహసీల్దార్ తిరుపతయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటు హక్కు కలిగిన పట్టభద్రులు తమ ఓటర్ కార్డు చూపించి ఓటరు చిట్టీలను పొందాలని ఆయన సూచించారు.

అవినీతిరహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం


అంజిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తమ్మినేని వీరభద్రం

తిప్పర్తి, మే 16: సమాజ మార్పు కోసం పని చేసే వారే కమ్యూనిస్టులని, అవినీతి రహిత సమాజ నిర్మాణమే కమ్యూనిస్టుల లక్ష్యమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. తిప్పర్తి మండల పరిధిలోని అంతయ్యగూడెం గ్రామంలో గురువారం నిర్వహించిన సీపీఎం సీనియర్ నాయకుడు నన్నూరి అంజిరెడ్డి సంతాప సభకు ఆయన హాజరై మాట్లాడారు. నిరంతరం పేదల హక్కుల కోసం పోరాడిన అంజిరెడ్డి మృతి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని పేర్కొన్నారు. వారి ఆశయాలు నేటి యువతరానికి మార్గదర్శకంగా ఉండాలని సూచించారు. కమ్యూనిస్టులు ప్రపంచవ్యాప్తంగా ఉన్నారని, వారు మానవ సమాజానికి కూడు, గూడు, ఉపాధి, ఉచిత విద్య, వైద్య సదుపాయాలను అందజేయడం కోసం పని చేస్తున్నట్లు తెలిపారు. దేశ రాజకీయాల్లో బడా కంపెనీల అధినేతలు చొరబడి రాజకీయాలను కలుషితం చేశారని ఆరోపించారు. తన జీవితమంతా ప్రజా ఉద్యమాల కోసం పని చేసి మరణానంతరం మృతదేహాన్ని వారి కుటుంబసభ్యులు మెడికల్ కళాశాల వైద్య విద్యకు ఉపయోగపడే విధంగా అందజేయడం అభినందనీయమని అన్నారు. కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ నన్నూరి అంజిరెడ్డి తన ఇంటిని సీపీఎం కార్యాలయంగా మార్చి పేదలకు ఎంతో సేవ చేశారని కొనియాడారు. ఉద్యమాల ద్వారా ఎంతో మందిని సీపీఎం నాయకులుగా తీర్చిదిద్దడం అభినందనీయమని గుర్తుచేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు బొంతల చంద్రారెడ్డి, తుమ్మల వీరారెడ్డి, శ్రీశైలం, సయ్యద్ హాషం, పాలడుగు నాగార్జున, చిన్నపాక లక్ష్మీనారాయణ, పాలడుగు ప్రభావతి, ఊట్కూరి నారాయణరెడ్డి, ఎండీ సలీం, గంజి మురళీధర్, దండెంపల్లి సత్తయ్య, కుమారుడు వెంకటరమణారెడ్డి, కీర్తి, సువర్ణ, నన్నూరి కౌసల్యమ్మ, మండల నాయకులు బీరెడ్డి సీతారాంరెడ్డి, బీమగాని గణేష్, ఆకిటి లింగయ్య, శశిధర్, వెంకన్న, శ్రీనివాసులు, యాదగిరి, రాములు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి


పీహెచ్‌సీలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యసిబ్బంది

శాలిగౌరారం, మే 16: డెంగీ వ్యాధి పట్ల ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని శాలిగౌరారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సూర్యశిల్ప అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలో వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం పీహెచ్‌సీ ఆవరణలో ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పీహెచ్ఎన్ రాములమ్మ మాట్లాడుతూ స్వచ్ఛమైన గాలి, నీరు, ఆహారం తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌టీ యాదగిరి, హెచ్ఎస్.విజయలక్ష్మి, రామకుమారి, ఫార్మసిస్ట్ ప్రేమ్‌కుమార్, ఏఎన్ఎం మయూరి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

శాలిగౌరారం: శాలిగౌరారం మండలం ఆకారం గ్రామానికి చెందిన నిరుపేద అయిన ఆకవరం సోమేశ్వరాచారి అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. 2009- 10 ఎస్ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు సోమేశ్వరాచారి మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు.

శాలిగౌరారం: శాలిగౌరారం మండలం తక్కళ్లపహాడ్ గ్రామ శివారులో చేపడుతున్న ఆసీఫ్‌నహర్ కాల్వ పనులను తక్కళ్లపహాడ్ కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. ఈ కాల్వ నిర్మాణం కోసం మండలంలోని నాన్ ఆయకట్టు గ్రామాల ప్రజలు ఎదురుచూస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కట్టంగూరి సురేందర్‌రెడ్డి, తీరుపారి మల్లయ్య అన్నారు. ఎమ్మెల్యే సామేల్ ఈ కాల్వ నిర్మాణం కోసమే ఇటీవలే నిధులు మంజూరు చేయించి పనులు చేయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు చెరుకు జానయ్య, గంట సైదులు, పులిగిల్ల నరేందర్ పాల్గొన్నారు.

తిరుమలగిరి(సాగర్): ఇటీవల ఈదురుగాలులతో కూడిన వర్షం రావడంతో మండల కేంద్రానికి చెందిన జిల్ల ఉష అనే మహిళ ఇంటి పైకప్పు ఎగిరిపోయింది. ఇంటి మరమ్మతులకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకుడు, పీఏసీఎస్ డైరెక్టర్ ఆవుల నాసర్‌రెడ్డి బాధితురాలిని పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఆపదలో ఉన్న నిరుపేదల కోసం తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ శాగం శ్రవణ్‌కుమార్‌రెడ్డి, మత్స్య కార్మిక సొసైటీ చైర్మన్ పిట్టల కృష్ణ, షేక్ సుబాని, శాగం సైదిరెడ్డి, నాగెండ్ల భాస్కర్‌రెడ్డి, శాగం గోపి, శివచారి, చెన్నబోయిన రాము, కటికర్ల సతీష్, వెంకటయ్య, శంకర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వేములపల్లి: మండలంలోని మొల్కపట్నం గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన దేవరకొండ శ్రీనుకు గ్రామంలోని అంబేడ్కర్ యూత్ కమిటీ సభ్యులు రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదే విధంగా గ్రామ మాజీ సర్పంచ్ నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి సైతం బాధితుడు శ్రీనుకు రూ.6వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యూత్ కమిటీ సభ్యులు రెమడాల సతీష్, వల్లమల్ల పరమేష్, పుట్టల మాదేష్, నాగరాజు, తిరుమలేష్, దశరథ, సురేందర్ పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: బీసీ రిజర్వేషన్లు 23 నుంచి 42 శాతానికి పెంచిన అనంతరమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వగిడి జీడయ్యయాదవ్ డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల తరుణంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రిజర్వేషన్ పెంచాలని అన్నారు. బీసీ డిక్లరేషన్‌లో అధికారంలోకి వచ్చిన ఆరు నెలలలోపు బీసీ కులగణన చేపడతామని పేర్కొన్న కాంగ్రెస్ పార్టీ ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం సరికాదన్నారు. తక్షణమే బీసీ రిజర్వేషన్లపై సమీక్షా సమావేశం నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు సురేష్, రాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

హాలియా: అనుముల మండలం పాలెం గ్రామానికి చెందిన నర్సింగ్ గిరి ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి కింద పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురాంరెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించి రూ. 5వేలు అందజేయగా బీజేపీ నాయకుడు మన్నెం రంజిత్‌యాదవ్ యువజన సేన ఆధ్వర్యంలో రూ.5 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో తిరుమలగిరిసాగర్ మండల వైస్ ఎంపీపీ యడవల్లి దిలీప్‌రెడ్డి, బుర్రి రాంరెడ్డి, కూన్‌రెడ్డి సంతోష్‌రెడ్డి, గడ్డం సజ్జన్, అబ్దుల్ కరీం, లింగస్వామి, శివానందరెడ్డి, రమేష్‌చారి, గజ్జల నాగార్జునరెడ్డి, సజ్జన్, రామకృష్ణారెడ్డి, సతీష్‌గౌడ్ పాల్గొన్నారు.

చిట్యాలరూరల్: మాజీ మంత్రి, బీజేపీ నాయకుడు ఈటెల రాజేందర్‌ను ఆ పార్టీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దగోని అంజన్‌కుమార్‌గౌడ్ కలిశారు. నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి హాజరైన రాజేందర్‌ను అంజన్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఎమ్మెల్సీగా అభ్యర్థిని గెలిపించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, శానంపూడి సైదిరెడ్డి, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డితో పాటు పలువురిని మర్యాదపూర్వకంగా కలిశారు.

చిట్యాలరూరల్: చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలో జరుగుతున్న హాకీ ఉచిత శిక్షణ శిబిరంలోని క్రీడాకారులకు స్థానిక మాజీ వార్డు సభ్యుడు ఉయ్యాల లింగస్వామి అరటి పండ్లు పంపిణీ చేశారు. క్రీడాకారులు శారీరకంగా, ఆరోగ్యంగా ఉండాలంటే వారికి పండ్లు ఎంతో అవసరమని అన్నారు. తనవంతుగా క్రీడాకారులకు పండ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కోచ్ గంగపురం రాము, కొత్త లింగస్వామి, యద్దనపురి సంతో ష, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ: పార్లమెంటు ఎన్నికల్లో భువనగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి అత్యధికంగా ఓట్లు వస్తాయని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాందాసు శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ మేతరి యాదయ్య అన్నారు. ప్రత్యర్థి పార్టీలు ఎన్ని ఎత్తుగడలు వేసినా మండల ప్రజలు కాంగ్రెస్ వైపే మొగ్గు చూపారని అన్నారు. సమావేశంలో రమావత్ శ్రీనివాస్ నాయక్ , హనుమంత్, రేవంత్, శ్రీనివాస్, వెంకటేష్, బంగారం, దేవదానం, వెంకన్న పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాడ్గులపల్లి: మండలంలోని పాములపాడు గ్రామంలో ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ ఇమ్మానియేల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామానికి చెందిన 500 మందికి ఉచితంగా రక్త, బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలతో పాటు మందును పంపిణీ చేశారు. కార్యక్రమంలో జితేంద్ర, ప్రమోద్, సంధ్యారాణి, మనోజ్ఞ, వికాస్, ల్యాబ్ టెక్నీషియన్స్, క్యాంప్ మేనేజర్ జంగా, జయరాజ్, సమూయేల్, సోలోమోన్, స్వామి, జానకిరామ్, సన, జవాజి, ఆనంద్‌కుమార్, జెస్సీకుమార్, తిమోతి, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.



వైద్యశిబిరంలో అవగాహన కల్పిస్తున్న వైద్యులు